

అంబేద్కర్, బుద్ధుడి చిత్రపటాలపై పూలు చల్లుతున్న మాజీ మంత్రి జోగు రామన్న

# చరిత్రను భావితరాలకు తెలియజేయాలి..

**- మాజీ మంత్రి జోగు రామన్న**

ఎదులాపురం, జనవరి 1 : మహనీయుల జీవిత చరిత్రను భావితరాలకు తెలియజేసి, వారి ఆశయసాధనకు పాటు పడాలని మాజీ మంత్రి జోగు రామన్న అన్నారు. సోమవారం ఆదిలాబాద్ జిల్లా కేంద్రంలోని అశోక్ బుద్ధ విహార్‌లో నిర్వహించిన భీమా కోరేగావ్ శౌర్య దివస్ కార్యక్రమానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా 1818లో జరిగిన యుద్ధంలో అమరులైన వీరులను స్మరించుకుని నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమంలో అంబేద్కర్ మెమోరియల్ అసోసియేషన్ అధ్యక్షుడు భీంరావు వాగ్మారే, ప్రధాన కార్యదర్శి దాదాసాహెబ్ జబాడే, నేతకాని మహర్ సంక్షేమ సంఘం అధ్యక్షుడు దుర్గం శేఖర్, ఎంపీపీ గంద్రత్ రమేశ్, మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ మెట్టు ప్రహ్లాద్, బీఆర్ఎస్ జిల్లా ఉపాధ్యక్షుడు విజ్జ గిరి నారాయణ పాల్గొన్నారు.

# ముగిసిన 'నాగోబా' వార్షికోత్సవ వేడుకలు




హోమంలో పాల్గొన్న మెస్రం వంశీయులు

ఇంద్రవెల్లి, జనవరి 1 : ఆదిలాబాద్ జిల్లా ఇంద్రవెల్లి మండలంలోని కేస్లాపూర్‌లో గల నాగోబా ఆలయ ప్రథమ వార్షికోత్సవ వేడుకలు వైభవంగా ముగిశాయి. సోమవారం నాగోబా ఆలయంలో మెస్రం వంశీయుల పీఠాధిపతి మెస్రం వెంకట్‌రావ్‌పటేల్ ఆధ్వర్యంలో ఆదివాసీ గిరిజన వేదపండితుల మంత్రోచ్చారణల మధ్య పూజలు నిర్వహించారు. ఉమ్మడి జిల్లాతోపాటు ఇతర ప్రాంతాల నుంచి మెస్రం వంశీయులు తరలివచ్చారు. ఈ కార్యక్రమంలో మెస్రం వంశీయులు పాల్గొన్నారు.

# 'పార్లమెంట్'కు సన్నద్ధం

## సార్వత్రిక ఎన్నికల సన్నాహక సమావేశానికి బీఆర్ఎస్ రెడీ

- రేపు హైదరాబాద్‌లో ఆదిలాబాద్ ఎంపీ నియోజకవర్గ నాయకులతో భేటీ
- అసెంబ్లీ ఎన్నికల్లో గులాబీ పార్టీకి మెజారిటీ




ఆదిలాబాద్, జనవరి 1(నమస్తే తెలంగాణ) : పార్లమెంట్ ఎన్నికల సమరానికి భారత రాష్ట్ర సమితి(బీఆర్ఎస్) సన్నద్ధమవుతున్నది. ఇందులో భాగంగా హైదరాబాద్‌లోని తెలంగాణ భవన్‌లో ఈనెల 21వ తేదీ వరకు పార్లమెంట్ నియోజకవర్గాలవారీగా సన్నాహక సమావేశాలు ఏర్పాటు చేసింది. రేపు(బుధవారం) ఆదిలాబాద్ పార్లమెంట్ నియోజకవర్గ సన్నాహక సమావేశం ఉంది. బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్‌తోపాటు సీనియర్ నాయకులు, మాజీ మంత్రులు హాజరై దిశానిర్దేశం చేయనున్నారు. ఆదిలాబాద్ పార్లమెంట్ నియోజకవర్గ పరిధిలో ఆదిలాబాద్, బోథ్, ఖానాపూర్, నిర్మల్, ముథోల్, ఆసిఫాబాద్, సిర్పూర్ అసెంబ్లీ నియోజకవర్గాలు ఉన్నాయి. ఆయా అసెంబ్లీ నియోజకవర్గాల నుంచి ముఖ్య నాయకులు భేటీకి తరలి వెళ్లనున్నారు. లోక్‌సభ ఎన్నికల్లో గెలుపే లక్ష్యంగా, అనుసరించాల్సిన వ్యూహాలపై కేటీఆర్, ఇతర సీనియర్ నాయకులు సలహాలు, సూచనలు అందజేస్తారు. ఈ సమావేశాలు ముగిసిన తర్వాత జిల్లా, అసెంబ్లీ నియోజకవర్గాలవారీగా విస్తృత స్థాయి నాయకులు, కార్యకర్తల సమావేశాలు ఏర్పాటు చేసే అవకాశం ఉంది.

### బీఆర్ఎస్‌కు మెజారిటీ

ఆదిలాబాద్ పార్లమెంట్ పరిధిలో ఏడు అసెంబ్లీ నియోజకవర్గాలు ఉండగా.. బోథ్, ఆసిఫాబాద్ సెగ్మెంట్లలో బీఆర్ఎస్ అభ్యర్థులు విజయం సాధించారు. ఆదిలాబాద్, ఖానాపూర్, కాగజ్‌నగర్ నియోజకవర్గాల్లో తక్కువ ఓట్లతో ఓడిపోయారు. ఆదిలాబాద్ లోక్‌సభ పరిధిలోని ఆదిలాబాద్, బోథ్, ఖానాపూర్, నిర్మల్, ముథోల్, సిర్పూర్, ఆసిఫాబాద్ నియోజకవర్గాల్లో బీఆర్ఎస్ బలంగా ఉంది. ఇటీవల జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో పార్లమెంట్ నియోజకవర్గంలో బీఆర్ఎస్‌కు మెజారిటీ వచ్చింది. ఏడు నియోజకవర్గాల్లో బీఆర్ఎస్ 4,65,476 ఓట్లు రాగా, బీజేపీకి 4,48,967, కాంగ్రెస్‌కు 2,52,281 ఓట్లు వచ్చాయి. బీజేపీ కంటే బీఆర్ఎస్‌కు 16,509 ఓట్లు అధికంగా వచ్చాయి. ఆదిలాబాద్ లోక్‌సభ నియోజకవర్గ పరిధిలో బీఆర్ఎస్ బలంగా ఉంది. ఇద్దరు ఎమ్మెల్యేలు, స్థానిక సంస్థల ప్రజాప్రతినిధులు, మున్సిపాలిటీ చైర్మన్లు, ఇతర ప్రజాప్రతినిధులు అధిక సంఖ్యలో ఉన్నారు. రేపు జరిగే సన్నాహక సమావేశం బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తల్లో ఉత్సాహం నింపనుంది. సమావేశానికి బయలుదేరడానికి అన్ని ఏర్పాట్లు చేసినట్లు ఆదిలాబాద్ బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు జోగు రామన్న తెలిపారు. పార్టీ పెద్దల సూచనల మేరకు ఎంపీ ఎన్నికలకు సన్నద్ధమవుతామని రామన్న పేర్కొన్నారు.



క్యాంపు కార్యాలయంలో కేక్ కట్ చేస్తున్న ఆదిలాబాద్ కలెక్టర్ రాహుల్ రాజ్ దంపతులు

# నూతన సంవత్సర శుభాకాంక్షలు

**ఆదిలాబాద్ కలెక్టర్ రాహుల్‌రాజ్, ఎస్పీ ఉదయ్ కుమార్‌రెడ్డి**

ఎదులాపురం, జనవరి 1 : ఆదిలాబాద్ కలెక్టర్ రాహుల్‌రాజ్ జిల్లావాసులకు నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలియజేశారు. సోమవారం కలెక్టర్ క్యాంపు కార్యాలయంలో కలెక్టర్ రాహుల్ రాజ్, ఎస్పీ డి.ఉదయ్‌కుమార్‌రెడ్డి, రెవెన్యూ అదనపు కలెక్టర్ శ్యామలాదేవి, ఎమ్మెల్యే పాయల్ శంకర్‌లకు కార్యాలయ సిబ్బంది నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు.

### ఎస్పీ కార్యాలయంలో వేడుకలు

ఆదిలాబాద్ ఎస్పీ క్యాంపు కార్యాలయం, పోలీస్ హెడ్‌క్వార్టర్‌లో సోమవారం నూతన సంవత్సర వేడుకలు ఘనంగా జరిగాయి. ఈ సందర్భంగా ఎస్పీ ఉదయ్‌కుమార్‌రెడ్డిని ఆదిలాబాద్, ఉట్నూర్ సబ్ డివిజనల్ పోలీసు ఉన్నతాధికారులు, సీఐ, ఎస్ఐలు కలిసి కేక్ కట్ చేశారు. అనంతరం స్థానిక ఎమ్మెల్యే పాయల్ శంకర్‌కు ఎస్పీ పుష్పగుచ్ఛం అందజేసి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలియజేశారు.



పోలీసులతో కలిసి కేక్ కట్ చేస్తున్న ఆదిలాబాద్ ఎస్పీ ఉదయ్‌కుమార్‌రెడ్డి



భీంపూర్ మండలంలోని ఆధార్ కేంద్రం వద్ద బారులు

# 'ఆధార్' అవస్థలు

**ఆదిలాబాద్ జిల్లా** భీంపూర్ మండలంలోని ఆధార్ కేంద్రాల వద్ద జనం బారులుదీరారు. కాంగ్రెస్ ప్రభుత్వం అభయహస్తంలో భాగంగా ఆరు గ్యారెంటీలకు ఆధార్ కార్డు ప్రధానం కావడంతో కేంద్రాల వద్దకు వృద్ధులు, పిల్లలతో మహిళలు, యువతీయువకులు తరలివచ్చారు. ఈ సందర్భంగా దరఖాస్తుదారులను పలుకరించగా.. కొత్త ఆధార్ కార్డు తీసుకోవడం కోసం, ఇంటి పేర్లు, ఫొటోలు, ఫోన్ నంబర్లు, రాష్ట్రం పేరు తప్పుగా ఉండడంతో సవరించుకోవడానికి వచ్చామని తెలిపారు. ఇంకొందరు వేలిముద్రలు ఇవ్వడానికి వచ్చామని చెప్పారు. *- భీంపూర్, జనవరి 1*

# భక్తజన సంద్రం.. బాసర క్షేత్రం..

- భక్తులతో పోటెత్తిన సరస్వతీ అమ్మవారి ఆలయం
- నూతన సంవత్సరాన్ని పురస్కరించుకొని తరలివచ్చిన భక్తులు

బాసర, జనవరి 1 : నూతన సంవత్సరం తొలిరోజు సెలవు దినం కావడంతో భక్తులు బాసరకు పోటెత్తారు. తెలుగు రాష్ట్రాలతో పాటు మహారాష్ట్ర నుంచి తరలివచ్చారు. ముందుగా గోదావరిలో స్నానాలు ఆచరించి అమ్మవారిని దర్శించుకున్నారు. ఈ సందర్భంగా తమ చిన్నారులకు అక్షరాభ్యాసాలు చేయించారు. అమ్మవారిని నిజామాబాద్ అర్బన్ ఎమ్మెల్యే ధన్‌పాల్ సూర్యనారాయణ గుప్తా దర్శించుకున్నారు.



బాసర ఆలయంలో భక్తులు

*పుస్తకాలు పట్టాల్సిన చేతులు.. పలుగు, పారా పడుతున్నాయి. రెక్కాడితే కానీ డొక్కాడని కుటుంబాల్లో పుట్టిన చిన్నారులు కూలీలుగా మారుతున్నారు. బట్టల షాపులు, కిరాణా దుకాణాలు, ఫ్యాక్టరీలు, మిర్చి బండ్లు, హోటళ్లలో పనిచేస్తు పొట్ట పోసుకుంటున్నారు. చదువుకోవాలనే కోరిక ఉన్నా.. ముక్కు పచ్చలారని వయసులో బంగారు భవిష్యత్‌ను నాశనం చేసుకుంటున్నారు. వెట్టిచాకిరీని రూపుమాపాలనే ఉద్దేశంతో కేసీఆర్ సర్కారు ఆపరేషన్ స్మైల్ అండ్ ఆపరేషన్ ముస్కాన్ ప్రవేశపెట్టింది. గడిచిన ఆరేండ్లుగా వేలాది మంది బాల కార్మికులను వెట్టిచాకిరీ నుంచి విముక్తి ప్రసాదించి.. చదువుల తల్లి ఒడిలో చేర్పింది. ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలో జనవరి 1వ తేదీన ప్రారంభమైన ఈ కార్యక్రమాలపై 'నమస్తే తెలంగాణ' అందిస్తున్న ప్రత్యేక కథనం..*



# చిన్నారి మోములో చిరునవ్వు

## కేసీఆర్ సర్కారు హయాంలో ఆపరేషన్ స్మైల్, ఆపరేషన్ ముస్కాన్ ప్రారంభం

- బాల కార్మిక వ్యవస్థ నిర్మూలనే ధ్యేయంగా కొనసాగుతున్న కార్యక్రమాలు
- ఇప్పటివరకు 6,369 మంది పిల్లలకు విముక్తి
- తాజాగా జనవరి 1వ తేదీన మొదలైన కార్యక్రమం

మంచిర్యాల, జనవరి 1(నమస్తే తెలంగాణ ప్రతినిధి) : కేసీఆర్ ప్రభుత్వం 2017 సంవత్సరంలో ఆపరేషన్ ముస్కాన్ కార్యక్రమాన్ని తీసుకొచ్చింది. యేడాదికి రెండు (జనవరి, జూలై) సార్లు బాల కార్మికులను గుర్తిస్తున్నారు. ఈ రెండు నెలలతోపాటు ప్రత్యేక బృందాలు కూడా పిల్లలను గుర్తించి విముక్తి కల్పిస్తున్నాయి. ప్రతి నియోజవర్గానికి ఒక బృందం పని చేస్తుండగా.. ప్రతి టీమ్‌లో ఒక ఎస్ఐ, నలుగురు కానిస్టేబుల్స్, ఒక స్త్రీ, శిశు సంక్షేమ శాఖ అధికారి, ఒక కార్మికశాఖ అధికారి మొత్తం ఏడుగురు ఉన్నారు. వీరు పనులు చేసే పిల్లలను గుర్తించడం, వారి తల్లిదండ్రులకు కౌన్సెలింగ్ ఇచ్చి పిల్లలు చదువుకునేలా చేయడం, అనాథ పిల్లలను చేరదీసి చదివించేలా చర్యలు తీసుకోవడం చేస్తున్నారు.

### ఉమ్మడి జిల్లాలోనే అధికం

గడిచిన ఆరేండ్లలో ఉమ్మడి జిల్లావ్యాప్తంగా 6,369 మంది బాల కార్మికులను గుర్తించారు. వీరిలో బాలురు 4,798, బాలికలు 1,571 ఉన్నారు. ఇందులో 5,745 మంది పిల్లల తల్లిదండ్రులను పిలిచి కౌన్సెలింగ్ ఇచ్చారు. అనంతరం ఆ పిల్లలను పాఠశాలల్లో చేర్పించారు. వీరిలో తల్లిదండ్రులు లేని, ప్రత్యేక పరిస్థితుల్లో ఉన్న పిల్లలు 624 మందిని ప్రభుత్వ సంరక్షణ కేంద్రాల్లో ఉంచారు. బాల కార్మికులు అధికంగా బేకరీలు, ఫ్యాక్టరీలు, బట్టల దుకాణాలు, ఫ్రూట్స్ షాపులు, మిర్చి బండ్లు, హోటళ్లు, చిరువ్యాపారాలు చేసే సెంటర్లలో ఉంటున్నారు. 14ఏండ్లలోపు పిల్లలను పనిలో పెట్టుకోకూడనే నిబంధనను పట్టించుకోకుండా పిల్లలను పనిలోకి తీసుకున్న యాజమాన్యాలపై కేసులు నమోదు చేస్తున్నట్లు అధికారులు పేర్కొంటున్నారు.

### రెండు నెలలపాటు నిర్వహిస్తాం..

**- కొట్టె చిన్నయ్య, జిల్లా స్త్రీ, శిశు సంక్షేమ శాఖ అధికారి, మంచిర్యాల.**

మంచిర్యాల జిల్లాలో పదో విడుత ఆపరేషన్ స్మైల్ అండ్ ఆపరేషన్ ముస్కాన్ కార్యక్రమాన్ని ప్రారంభించాం. జనవరి 1వ తేదీ సెలవు వచ్చినందున 2వ తేదీ నుంచి క్షేత్రస్థాయిలో పర్యటించేలా ప్రణాళికలు సిద్ధం చేసుకున్నాం. మంచిర్యాల, బెల్లంపల్లి, జైపూర్‌లో మూడు ప్రత్యేక బృందాలు రెండు నెలలపాటు పని చేస్తున్నాయి. బాల కార్మిక పిల్లలను బడుల్లో చేర్పిస్తాం. ఒకేసారి బడిలో చేర్చి వదిలేయకుండా మానిటరింగ్ చేస్తాం. ఇందులో పోలీసు శాఖ సహకారం మరువలేనిది. బేటీ బచావో ఆందోళన్(బీబీఏ) లాంటి స్వచ్ఛంద సంస్థలు మాతో కలిసి పని చేస్తున్నాయి.



మంచిర్యాలలో తనిఖీలు నిర్వహిస్తున్న అధికారులు(ఫైల్)

**జిల్లాల వారీగా 2017 నుంచి 2023 వరకు ఆపరేషన్ స్మైల్ అండ్ ఆపరేషన్ ముస్కాన్‌లో రెస్క్యూ చేసిన పిల్లల వివరాలు**

| సంవత్సరం | బాలురు | బాలికలు | మొత్తం | తల్లిదండ్రులకు అప్పగించిన పిల్లలు | ప్రభుత్వ ఆధీనంలో పిల్లలు |
|---|---|---|---|---|---|
| నిర్మల్ జిల్లాలో .. | | | | | |
| 2017 | 101 | 40 | 141 | 141 | 00 |
| 2018 | 72 | 17 | 89 | 89 | 00 |
| 2019 | 125 | 22 | 147 | 147 | 00 |
| 2020 | 78 | 66 | 144 | 144 | 00 |
| 2021 | 230 | 98 | 328 | 328 | 00 |
| 2022 | 133 | 67 | 200 | 190 | 10 |
| 2023 | 45 | 22 | 67 | 67 | 00 |
| మొత్తం | 784 | 332 | 1,116 | 1,106 | 10 |
| ఆదిలాబాద్ జిల్లాలో .. | | | | | |
| 2017 | 228 | 63 | 291 | 226 | 65 |
| 2018 | 271 | 41 | 312 | 156 | 156 |
| 2019 | 312 | 61 | 373 | 314 | 59 |
| 2020 | 207 | 13 | 220 | 220 | 00 |
| 2021 | 180 | 05 | 185 | 185 | 00 |
| 2022 | 88 | 08 | 96 | 93 | 03 |
| 2023 | 92 | 14 | 106 | 106 | 00 |
| మొత్తం | 1,378 | 205 | 1,583 | 1,300 | 283 |

# పెంచికల్ పేట వృక్ష శిలాజాల కోట

## కొండపల్లి, బొంబాయిగూడ అడవుల్లో గుర్తింపు

- 30 ఎకరాల విస్తీర్ణంలో రకరకాల శిలాజాలు
- ఫాజిల్ పార్కు ఏర్పాటు చేసి రక్షణ చర్యలు చేపట్టాలని కోరుతున్న స్థానికులు
- పర్యాటక అభివృద్ధికి కృషి చేస్తామంటున్న అధికారులు

*కాగజ్‌నగర్ అటవీ డివిజన్‌లోని పెంచికల్‌పేట్‌రేంజ్ అరుదైన వృక్ష శిలాజాలకు కేరాఫ్‌గా నిలుస్తున్నది. కొండపల్లి, బొంబాయిగూడ అటవీ ప్రాంతంలో 30 ఎకరాల విస్తీర్ణంలో ఉన్నట్లు యంత్రాంగం గుర్తించడం ప్రాధాన్యం సంతరించుకున్నది. వడగాంలోలాగే.. ఇక్కడా ఫాజిల్ పార్కు ఏర్పాటు చేసి.. వాటిని రక్షించాలని స్థానికులు కోరుతుండగా, సర్కారుకు నివేదికలందిస్తామని ఫారెస్ట్‌శాఖ చెబుతున్నది.*



కొండపల్లిలో వృక్ష శిలాజాలాలు

పెంచికల్‌పేట్, జనవరి 1 : దక్షిణ భారతదేశంలోనే కాగజ్‌నగర్ అటవీ డివిజన్‌లోని పెంచికల్‌పేట్‌రేంజ్‌కు ఓ ప్రత్యేకత ఉంది. సిద్ధేశ్వర గుహలు, ప్రాణహిత పెద్ద వాగు సంగమం, జలపాతాలు, ఎత్తయిన కొండలు, పొడవు ముక్కు రాబందులు, గడ్డి మైదానాలు, పెద్ద పులులు, 250 రకాల పక్షి జాతులు, అరుదైన వృక్ష శిలాజాలకు ప్రసిద్ధిగాంచింది.

### వృక్ష శిలాజాల గుర్తింపు..

2013లో పెంచికల్‌పేట్ రేంజ్‌లోని కొండపల్లి, బొంబాయిగూడ అటవీప్రాంతంలో వృక్ష శిలాజాలను అధికారులు గుర్తించారు. సుమారు 30 ఎకరాల విస్తీర్ణంలో వివిధ రకాల వృక్షశిలాజాలు ఉన్నట్లు గుర్తించారు. పలుమార్లు సర్వేచేసి కొన్ని శిలాజాలు 9 నుంచి 25 అడుగుల పొడువు, మరికొన్ని 50 అడుగుల పొడువు ఉన్నట్లు తెలిపారు. 2015లో తెలంగాణ చరిత్రకారుల బృందం సైతం ఈ ప్రాంతాన్ని సందర్శించి రక్షణ చర్యలు చేపట్టాలని ప్రభుత్వానికి సిఫారసు చేసింది. అప్పటి కలెక్టర్ చంపాలాల్ ఈ ప్రాంతాన్ని సందర్శించి ఫాజిల్ పార్కుగా అభివృద్ధి చేయాలన్న అభిప్రాయం వ్యక్తం చేశారు. వీటి వల్ల చరిత్రకు సంబంధించిన ఎన్నో విషయాలు బయటకు వచ్చే అవకాశాలున్నాయి.

### వడగాంలో ఫాజిల్ పార్క్..

కొన్నేళ్ల క్రితం మహారాష్ట్ర-తెలంగాణ సరిహద్దుల్లోనున్న గడ్చిరోలికి 15కిలో మీటర్ల దూరంలో వడగాంలో వృక్ష శిలాజాలను శాస్త్రవేత్తలు గుర్తించారు. ఇవి 6.5 కోట్ల ఏళ్ల క్రితం ఏర్పడి ఉంటాయని జియలాజికల్ సర్వే ఆఫ్ ఇండియా అధికారులు భావించారు. ఈ ప్రాంతాన్ని వడగాం ఫాజిల్ పార్కుగా అభివృద్ధి చేశారు. కొండపల్లి అటవీ ప్రాంతంలోని శిలాజాల వయసు కూడా అంతే ఉంటుందని అంచనా వేశారు. కొండపల్లి నుంచి కొన్ని వృక్ష శిలాజాలలను మంచిర్యాల జిల్లా కేంద్రంలోని గాంధారి వనానికి తరలించి సందర్శనకు ఉంచారు. ఇంతటి ప్రాచీనమైన ఈ శిలాజాలను రక్షించాల్సిన అవసరం ఎంతైనా ఉందని గ్రామస్తులు కోరుతున్నారు. వడగాం ఫాజిల్ పార్కులాగే.. కొండపల్లిలోనూ ఏర్పాటు చేస్తే యువతకు ఉపాధి అవకాశాలు దొరుకుతాయని చెబుతున్నారు.



కొండపల్లిలో అరుదైన వృక్షశిలాజాలు

### ఉన్నతాధికారులకు నివేదిస్తాం



కొండపల్లి, బొంబాయిగూడ అటవీ పరిధిలో అనేక వృక్ష శిలాజాలు ఉన్నాయి. వీటి రక్షణకు ప్రత్యేక చర్యలు తీసుకుంటాం. ప్రభుత్వానికి నివేదికలు పంపించి పర్యాటకంగా అభివృద్ధి చేసేందుకు కృషి చేస్తాం. *-వేణుగోపాల్, ఎఫ్ఆర్వో, పెంచికల్‌పేట్*